ప్రజాశక్తి
శనివారం 8 ఫిబ్రవరి 2025
8 పేజీలు




విశాఖపట్నం అనకాపల్లి

# దరిచేరని లక్ష్యం



సాగులో ఉన్న ఆయిల్ పామ్

◆ నిరాశాజనకంగా ఉద్యానశాఖ ప్రగతి
◆ ఆయిల్ పామ్ సాగు అంతంతే..

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలో ఉద్యాన శాఖ ఈ ఏడాది పథకాల లక్ష్యాన్ని చేరుకునేలా లేదు. ఆర్థిక సంవత్సరం మరో 50 రోజుల్లో ముగియనుండగా గడిచిన కాలమంతా నిరాశాజనకంగానే ఆ శాఖ ప్రగతి ఉంది. లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించి, అధిక ఆదాయాలు రాబట్టడానికి ఉద్దేశించిన పథకాలు రైతుకు సంపూర్ణంగా చేరడంలేదు. గ్రామాల్లో రైతుకు అవగాహన కల్పించకపోవడం, నిధుల సమస్య వెరసి పథకం అమల్లో ప్రగతి ఆశించిన స్థాయిలో లేదు. ప్రధానంగా ఆయిల్ పామ్ పథకం అమలు నిరాశాజనకంగా ఉంది. రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్‌కెవివై) పథకం కింద నూతన తోటల పెంపకం, బొప్పాయి సాగు, టిష్యూ కల్చర్ అరటి, అల్లం, మామిడి, జీడి మామిడి, కూరగాయల సాగు విస్తీర్ణం విస్తరించాల్సివుంది. ఆర్‌కెవివై పథకం కింద యూనిట్ విలువలో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాల్సివుంది. రెండు ప్రభుత్వాల నుంచీ సరిగా నిధులు రాలేదు. అవగాహన కలిగిన రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపుతున్నా సకాలంలో నిధులు రాక ఉత్సాహంగా పంట సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. మధ్య తరగతి రైతులకు అవగాహన లేక ఈ పథకాలను ఉపయోగించుకోలేని స్థితి ఏర్పడింది.

జిల్లాలో ఆర్‌కెవివై పథకంలో భాగంగా మామిడి, జీడి తోటలు, కొబ్బరి, బొప్పాయి, కూరగాయల సాగులో లక్ష్యాలు చేరుకోవడం దగ్గరగా వున్నప్పటికీ, ఆయిల్ పామ్ పథకం లక్ష్యానికి దూరంగా వుంది. ఆయిల్ పామ్ పథకం కింద స్వదేశీ రకం మొక్కలతో 775 ఎకరాల్లో కొత్తగా సాగుచేయాలని ప్రణాళిక తయారు చేసుకున్నప్పటికీ 82 ఎకరాలకే పరిమితమైంది. విదేశీ రకం మొక్కల ఆయిల్ పామ్ సాగు 3,100 ఎకరాల్లో సాగుచేయాలని భావించినా, ఇంతవరకు 1050 ఎకరాల్లో మాత్రమే సాగు నమోదైంది. అయిల్ పామ్ తోటల్లో అంతర పంటల సాగు ఆ మేరకు అనుకున్నట్లు జరగలేదు. ఈ ఏడాది వెయ్యి ఎకరాల్లో అంతర మిగతా 2లో..

వార్త మెయిన్‌లో..




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు, చిత్రంలో పద్మ, కృష్ణారావు

## సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సాధన
# ప్రజా పోరాట విజయం

◆ వాల్తేర్ డివిజన్ మొత్తాన్ని ఈ జోన్‌లోనే కొనసాగించాలి
◆ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

## బియ్యం రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం పోర్టు బియ్యం ఎగుమతుల్లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ విషయాన్ని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఇక్యు -1ఎ బెర్త్ వద్ద ఎంవి ఎలేఫ్థోత్రియా నౌకలో 7,790 మెట్రిక్ టన్నుల బియ్యం సంచులను బ్రేక్ బల్క్ ద్వారా విజయవంతంగా లోడ్ చేసినట్లు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 10న ఇక్యు - 4 వద్ద ఎంవి.అమిస్ విస్డం -2 నౌకలో రవాణా చేసిన 6,758 మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్‌నే ఇప్పటి వరకూ రికార్డుగా ఉందని, ప్రస్తుతం పోర్టు ఆ రికార్డును అధిగమించి నూతన రికార్డు నెలకొల్పిందని తెలిపారు.

## విద్యారంగ పరిరక్షణకు కృషి
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

▶ వార్త 4లో..

## మలేరియా, డెంగీని అరికట్టండి

▶ వార్త 2లో..

## పోర్టు స్టేడియంలో స్నో స్టేషన్

▶ వార్త 4లో..

## పలు రైళ్లు రద్దు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లో ఖాజీపేట - విజయవాడ సెక్షన్‌లో ఖమ్మం వద్ద ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా 18111 టాటానగర్ - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఫిబ్రవరి 13న, 18112 యశ్వంతపూర్ - టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను ఫిబ్రవరి 9, 16 తేదీల్లో రద్దు చేశారు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**మహా కుంభమేళా ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు**

మహా కుంభమేళా నేపథ్యంలో ప్రయాణికులు, యాత్రికులు, భక్తుల అదనపు రద్దీని నియంత్రించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే కుంభమేళా ప్రత్యేక రైళ్ల సేవలను మరో రెండు ట్రిప్పులు పెంచాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08588 విశాఖపట్నం - గోరఖ్‌పూర్ ప్రత్యేక రైలు ఫిబ్రవరి 10, 22 తేదీల్లో రాత్రి 10:20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి ఫిబ్రవరి 12, 24 తేదీల్లో రాత్రి 19.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. 08587 గోరఖ్‌పూర్ -విశాఖపట్నం ప్రత్యేక రైలు ఫిబ్రవరి 13, 25 తేదీల్లో సాయంత్రం 17.45 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయలుదేరి ఫిబ్రవరి 15, 27 తేదీల్లో 15.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

**ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి**

# 5వ రోజు 4 నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న శ్రీనివాసులు నాయుడు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం మరొక నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. పిఆర్‌టియు మద్దతుతో బరిలోకి దిగిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నూకల సూర్యప్రకాష్, రాయల సత్యన్నారాయణ, పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌కు ఆయన కార్యాలయంలో నామినేషన్లు, సంబంధిత పత్రాలను సమర్పించారు. ఈ క్రమంలో అభ్యర్థులందరితో జిల్లా కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఇదిలా ఉండగా ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు గడువు కాగా ఇప్పటికే అయిదు రోజుల గడువు అయిపోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం ఒక్క రోజే నామినేషన్లు వేయడానికి గడువు ఉంది. ఇప్పటి వరకు ఎనిమిది నామినేషన్లు దాఖలవగా అభ్యర్థులు 14 సెట్లు సమర్పించారు. ఎఆర్‌ఒ, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, నోడల్ అధికారి, విఎంఆర్‌డిఎ ఎస్టేట్ అధికారి దయానిధి, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది అభ్యర్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారు.

**శ్రీనివాసులు నాయుడు ర్యాలీ**

మాజీ ఎమ్మెల్సీ, పిఆర్‌టియు మద్దతుతో ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు ముందుగా జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య, ఉత్తరాంధ్ర కన్వీనర్ గోపీనాథ్ పాల్గొన్నారు

మొదటి పేజీ తరువాయి..

## దరిచేరని లక్ష్యం

పంటలు వేయాల్సివుండగా, 40 ఎకరాల్లో సాగు చేయగలిగారు.

జిల్లాలో తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సహకార చక్కెర ఫ్యాక్టరీల క్రషింగ్‌ను ప్రభుత్వం నిలిపివేయడంతో చెరుకు సాగు విస్తీర్ణం లక్ష ఎకరాల నుంచి 20 వేల ఎకరాలకు పడిపోయింది. చెరుకు సాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నా ఆ పథకాలు సరిగా అమలుకావడంలేదు. దీంతో ఆహార, ఉద్యాన పంటల స్థానంలో జాతీయ రహదారికి అనుకొని వున్న మండలాలతో పాటు అచ్యుతాపురం, రాంబిల్లి, సబ్బవరం సహా అనేక మండలాల్లో వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ కింద మారుతున్నాయి.

## మలేరియా, డెంగీని అరికట్టండి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జిల్లాలో మలేరియా, డెంగీ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ, నియంత్రణ సమన్వయ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులలో మలేరియా, డెంగీ వ్యాధులకు సంబంధించిన టెస్టులను నిర్వహించాలన్నారు. ప్రయివేట్ ఆసుపత్రులలో నమోదైన మలేరియా, డెంగీ వ్యాధుల వివరాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. నేవీ నిషేధిత ప్రాంతాలలో, క్వార్టర్లలో ఫాగింగ్, యాంటీలార్వా స్ప్రే చేసేందుకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని నేవీ అధికారులకు సూచించారు. పోర్టు అథారిటీ, స్టీల్‌ప్లాంట్‌కి సంబంధించి ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలను గుర్తించి మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా రైల్వే శాఖకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలలో పేపర్ ప్లేట్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఖాళీ వాటర్ బాటిళ్ల వంటి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి ఫాగింగ్, యాంటీలార్వా స్ప్రే చేయించాలని తెలిపారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యుల ద్వారా గ్రామాలలో దోమల నియంత్రణకు చేపట్టవలసిన చర్యలను, మలేరియా, డెంగీ వ్యాధుల వల్ల కలిగే ఇబ్బందులను చర్చకు పెట్టాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సిఎస్ఆర్ నిధుల నుంచి జిల్లాకు కేటాయించిన 8 ఫాగింగ్ మెషిన్లను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్‌డిఎ, సోషల్ వెల్ఫేర్, నేవీ, పోర్టు, స్టీల్‌ప్లాంట్, కెజిహెచ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ మార్కెట్‌లోకి ఎంజి మోటార్స్ ఆస్టర్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్స్ తమ శ్రేణిలో భారతదేశపు అత్యంత ఆధునిక ఎస్‌యువిఎంజి ఆస్టర్ - 2025 ఎడిషన్‌ను విశాఖ మార్కెట్‌లోకి శుక్రవారం విడుదల చేసింది. ఈ వాహనంతో షైన్, సెలక్ట్ వేరియెంట్స్ కోసం కొత్త ఫీచర్లను పరిచయం చేస్తున్నట్టు ఎంజి మోటార్స్ విశాఖపట్నం సేల్స్ హెడ్ జాన్సన్ తెలిపారు. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులోని ఎంజి మోటార్స్ షోరూమ్‌లో ఆయన మాట్లాడుతూ షైన్ వేరియెంట్ సన్ రూఫ్‌తో పాటు ఆరు స్పీకర్లతో వాహనం లభిస్తోందని, ఆహ్లాదకరమైన డ్రైవింగ్ అనుభవం అందిస్తుందని అన్నారు. ఈ వేరియెంట్ ఆరు ఎయిర్ బ్యాగ్స్, ఐవరీ లెదరేట్ సీట్లు కలిగి మరింత సౌకర్యం, భద్రతను అందిస్తుందన్నారు. ఈ వాహనం స్ప్రింట్, షైన్, సెలక్ట్, షార్ప్ ప్రో, సేవీ ప్రో వేరియెంట్లలో రూ.9.99 లక్షల ఎక్స్ షోరూం ధరకు లభిస్తుందని తెలిపారు.

## అల్లూరి శత వర్ధంతి జాతా పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన అల్లూరి సీతరామరాజు శత వర్ధంతి రాష్ట్ర వ్యాప్త విద్యార్థుల జాతా పోస్టర్‌ను సంఘం నాయకులు నగరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షులు సౌరవ్ ఘోష్, ప్రధాన కార్యదర్శి శిబాషిష్ ప్రహారాజ్, సహాయ కార్యదర్శి అజయ్ కామత్, రాష్ట్ర అధ్యక్షులు వి.హరీష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



పాత నగరంలోని మెయిన్ రోడ్డు

## ఎట్టకేలకు మెయిన్ రోడ్డు నిర్మాణం పూర్తి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** పాత నగరానికి శోభను చేకూర్చే మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.6 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్ట్ ఆఫీస్ వరకూ ఉన్న సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవైన మెయిన్ రోడ్డును వెడల్పు చేసి, అభివద్ధి పనులు పూర్తి చేయడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తపరుస్తున్నారు. గతంలో కొన్నిచోట్ల 20 అడుగులు, మరికొన్నిచోట్ల 3 అడుగులు వెడల్పుతో ఉండే ఈ మెయిన్ రోడ్డును వాసుపల్లి గణేష్ కుమార్ ఎమ్మెల్యేగా ఉండగా గత ప్రభుత్వ కాలంలో 60 అడుగుల వెడల్పుతో అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ సమయంలో అటు ఇటు ఉన్న అనేక దుకాణాలు, గృహాలను కొన్ని పాక్షికంగానూ, మరికొన్ని పూర్తిగానూ తొలగించవలసి వచ్చింది. పలు అభ్యంతరాల మధ్య, భవనాలు కోల్పోయిన కొందరికి నగదు రూపంలోనూ, మరికొందరికి టిడిఆర్ రూపంలోనూ నష్టపరిహారం చెల్లించారు. విద్యుత్ స్తంభాలను తొలగించి, అభివృద్ధి చేసిన రోడ్డుకు అటు ఇటు వాటిని ఏర్పాటు చేశారు. అండర్ గ్రౌండ్ వైరింగ్ పనులను పూర్తిగా మార్చివేసి కొత్తవి వేశారు. ఫుట్ పాత్ నిర్మాణం చేసి, అందమైన టైల్స్‌తో రూపుదిద్దారు. కొన్ని చోట్ల రోడ్డుకు అడ్డంగా ఉన్న కల్వర్టులను కూడా అభివృద్ధి చేశారు. పలుచోట్ల ఉన్న బస్సు స్టాపులను పూర్తిగా తొలగించారు. ఆ విధంగా తొలగించిన బస్సు స్టాప్‌లను మాత్రం పూర్తిస్థాయిలో పునరుద్ధరణ చేయలేదు. కొన్ని చోట్ల ఉన్నతంగా కొత్తగా బస్ స్టాప్‌లు ఏర్పాటు చేశారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా చొరవ చూపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న మెట్రో రైల్ ప్రాజెక్ట్ అమల్లోకి వస్తే ఇదే రోడ్డులో పాత పోస్ట్ ఆఫీస్ వరకు మెట్రో రైలు రానుంది. దానిని దృష్టిలో పెట్టుకొని కూడా మెయిన్ రోడ్డు విస్తరణకు ఏర్పాట్లు చేసినట్లుగా భావిస్తున్నారు.

# బాలికకు న్యాయం కోసం ధర్నా

### అత్యాచార నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ నగరంలోని హెచ్‌బి కాలనీ ప్రాంతం సింహాద్రిపురంలో పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలంటూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.మణి మాట్లాడుతూ జివిఎంసి కార్మికులు పారిశుధ్యం, నీటి సరఫరా వగైరా పనులు నిర్వహించడం కోసం తొలి కోడి కూయక ముందే విధులకు హాజరవుతుంటారని తెలిపారు. నగరంలో చెత్తను ఊడ్చి శుభ్రం చేసి, మంచినీరు సరఫరా చేస్తుంటారన్నారు. అటువంటి ప్రజా సేవకుల పిల్లలకు, ముఖ్యంగా ఆడపిల్లలకు నగరంలో రక్షణ కరువైందని ఆవేదన వెలిబుచ్చారు. మత్తు వదలని కామాంధుల చేతిలో పడి ఇటువంటి కార్మికుల పిల్లలు బలవుతున్నారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ వెంటనే స్పందించి కామాంధునికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినమైన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మద్యం షాపులు రద్దు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత వెంటనే స్పందించి అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జెఆర్.నాయుడు, అనిల్, సురేష్, ఇ.ఆదినారాయణ, శ్రావణ్, కె.కుమారి, హేమలత, కొండమ్మ, అనిత, సుమారు 700 మంది కార్మికులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న జివిఎంసి కార్మికులు

# విభాగాల పనితీరుపై సమీక్ష




మాట్లాడుతున్న విశ్వనాథన్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ శుక్రవారం పరిపాలనా, రెవెన్యూ, అలాట్‌మెంట్, సాంకేతిక, ప్రణాళికా విభాగాల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల పనితీరును సమీక్షించారు విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో అన్ని పార్కుల్లో రక్షణ చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు తప్పక పనిచేసేలా చూడాలని, అదేవిధంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఇంజినీరింగ్ పనుల అంచనాలను కచ్చితత్వంతో, సమగ్రంగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప పాల్గొన్నారు.

# సాంకేతిక ప్రగతిపై అవగాహన పెరగాలి




చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్స్ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

## గీతం వీసీ డాక్టర్ ఎరోల్ డిసౌజా

**ప్రజాశక్తి -మధురవాడ :** కాలానుగుణంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అవగాహన చేసుకుని అందుకు తగిన విధంగా సిద్ధమైనప్పుడే ఉద్యోగావకాశాలు లభిస్తాయని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా పేర్కొన్నారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యాన 'విద్యార్థులకు ఉద్యోగావకాశాలు-నైపుణ్యాలు' అనే అంశంపై శుక్రవారం 'చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్స్ (సిహెచ్ఆర్ఓ)' సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో కార్పొరేట్ సంస్థల పనితీరు మారుతోందని, విద్యార్థులకు విషయ పరిజ్ఞానంతో పాటు పని సంస్కృతి, సంస్థల పనితీరు, ఇతరులతో కలసి లక్ష్యాలను సాధించే నైపుణ్యం అవసరమన్నారు. గీతం ఇన్నోవేషన్ అధికారి ఎన్.క్రిష్ మాట్లాడుతూ, విద్యార్థులకు గీతంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం నుంచే సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ తప్పని సరిచేశామని, ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికీ మార్గదర్శకం లభించేలా 1400 మందిని మెంటార్లుగా నియమించామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ మార్పు చేయడానికి పారిశ్రామిక నిపుణులతో సలహా సంఘం నియమించామని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులను వాటికి తగ్గ నైపుణ్యాలను యువత పెంచుకోవాలని సూచించారు. కృత్రిమ మేధ కారణంగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతున్నప్పటికీ అదే సంఖ్యలో కొత్తతరం ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు.

ఎవోక్ టెక్నాలజీస్ ఉపాధ్యక్షుడు రమేష్ మంతన మాట్లాడుతూ, కాలానుగుణంగా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని, భావప్రకటన సామర్థ్యం, కలిసి పనిచేయగలిగే తత్వం అలవరుచుకోవాలని సూచించారు.

సదస్సులో సిస్కో సంస్థ ప్రతినిధి ఈస్విందర్ సింగ్, కెఫిన్‌టెక్ సంస్థ ఉపాధ్యక్షుడు కె.సాయిగౌతమ్, డిజిఫ్యాక్ సంస్థ సిఇఒ బి.విష్ణు, గీతం సిఎస్ఇ విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ శాంతి చిలుకూరి, ఇన్ఫోసిస్ విశాఖ అధిపతి ఎన్.సురేష్, కేట్‌లాగ్ సంస్థ మేనేజర్ సిరిచెందనరెడ్డి, కానిని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీనియర్ మేనేజర్ ప్రియామాలిని, కియా సంస్థ మానవవనరుల విభాగం నిపుణుడు జి.అశోక్, గీతం కోర్ ఇంజనీరింగ్ విభాగాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.ప్రసాద్‌రావు, జిసిజిసి అధిపతి ప్రొఫెసర్ ఉమాదేవి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు అవకాశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, చేరబోయే సంస్థల గురించి తెలుసుకోవడానికి వాటి వెబ్‌సైట్‌లను పరిశీలించాలని, ఇంజినీరింగ్‌లో చేసే ప్రాజెక్టులను నిజాయితీతో స్వయంగా అధ్యయనం చేయాలని, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని నిపుణులు సూచించారు. స్టార్టప్‌లను ప్రారంభించాలనుకునేవారు అందుకు సంబంధించిన అన్ని విభాగాలపైన అవగాహన కలిగి ఉండాలన్నారు.

## నేరాలు ఘోరాలు

### బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన పరదేశి

**ప్రజాశక్తి -పద్మనాభం :** మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ పరిధి విజయానందపురం గ్రామం సమీపంలో శుక్రవారం బస్సు ఢీకొని పల్లా పరదేశి మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి పల్లా పరదేశి, బంగారయ్య అన్నదమ్ములిద్దరూ విజయనగరంలో నివాసముంటున్నారు. వీరిద్దరూ సొంత గ్రామంలో పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వేర్వేరు సైకిళ్లపై పొట్నూరుకు వస్తున్నారు. విజయానందపురం గ్రామం సమీపంలో ఉన్న సిమెంట్ పైపుల కంపెనీ వద్దకు వచ్చేసరికి అదే మార్గంలో వస్తున్న ఆనందపురం మండలం గిడిజాలలోని సాయి గణపతి పాలిటెక్నికల్ కళాశాలకు చెందిన బస్సు పల్లా పరదేశిని ఢీకొట్టింది. పది అడుగుల దూరం వరకు ఈడ్చుకు పోయింది. పరదేశి సోదరుడు బంగారయ్య కేకలు వేసినప్పటికీ బస్సు వెంటనే ఆగలేదు. పరదేశి కాళ్లపై నుంచి బస్సు వెళ్లిపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పరదేశి భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రోజు కూలి నిమిత్తం విజయనగరం నుంచి రోజూ తిరుగుతున్న పరదేశి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కూలి తప్ప మరే ఆదాయంలేని ఆ కుటుంబం రోడ్డు పడిందని గ్రామస్తులు విచారం వ్యక్తంచేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో అటవీ ఉద్యోగి మృతి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:** నర్సీపట్నంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ ఉద్యోగి ఆర్.పుట్టన్న ప్రమాదవశాత్తు మరణించిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... విశాఖపట్నంకు ఆర్.పుట్టన్న వెళుతుంగా ఆర్టీసీ బస్సు వెనుక భాగంకు తన బైక్ హ్యాండిల్ తగలడంతో ప్రమాదవశాత్తు ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ సిఐ గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొయ్యూరు మండలం మర్రిపాక సెక్షన్ ఆఫీసర్‌గా ఆర్.పుట్టన్న విధులు నిర్వహిస్తున్నారు. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

## జై దుర్గాభవాని ఆలయ కమిటీ ఎన్నిక

**ప్రజాశక్తి -ఆనందపురం :** ఆనందపురం ఎస్‌సి, బిసి కాలనీలో ఉన్న జైదుర్గాభవాని ఆలయం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా లంకలపల్లి గిరిజ, అధ్యక్షులుగా కెల్లా రమణ, ఉపాధ్యక్షులుగా మక్కువ అప్పారావు, కార్యదర్శిగా ఉంగరాల శ్రీనివాసరావు, సహ కార్యదర్శిగా కెల్ల శ్రీను, కోశాధికారిగా ధనియాల అప్పలనారాయణ, సహ కోశాధికారిగా లంకలపల్లి అప్పలనారాయణ, ఆర్గనైజర్‌గా కంది వెంకన్న, మెంబర్లు చందక ఆప్పలనాయుడు, పోలిపల్లి పెంటయ్య, రౌతు గోపి, మేడిశెట్టి రాంజీ, ఆధాడ సత్యారావు, దనియాల సాయి, కడియం సత్యనారాయణ, కడమంచి నాగరాజు ఎన్నికయ్యారు. ఈ పదవీకాలం రెండేళ్లు ఉంటుంది. అనంతరం నూతన అధ్యక్షులు కెల్ల రమణను సభ్యులు సన్మానించారు.

## దుర్గమ్మ గుడి ప్రారంభోత్సవం

**ప్రజాశక్తి -ఆనందపురం :** ఆనందపురం మండలం జగన్నాథపురంలో దుర్గమ్మ తల్లి గుడి ప్రారంభోత్సవం శుక్రవారం చేశారు. ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. మధ్యాహ్నం 3,000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, సర్పంచ్ బంక శ్రీను, మాజీ సర్పంచ్ పాండ్రంగి అప్పలరాజు, మతికాన ఆదినారాయణ, జట్ల నాయుడు, రెల్లి గురునాయుడు, పూజారి పాండ్రంగి రమణ, పైడిరాజు పాల్గొన్నారు.

## పలు వేడుకలకు చిన్న శ్రీను హాజరు

**ప్రజాశక్తి- ఆనందపురం :** ఆనందపురం మండలం గండిగుండం ముత్యాలమ్మ తల్లిని భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి చిన్న శ్రీను దర్శించుకున్నారు. శొంఠ్యాంలో వైసిపి నాయకుడు గృహప్రవేశానికి హాజరయ్యారు. గంభీరంలో ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరాడ వెంకట్రావు, మజ్జి వెంకట్రావు, గండ్రెడ్డి శ్రీను, పాండ్రంగి శ్రీను, రౌతు శ్రీను బ్రదర్స్ పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాలతో సంగీతం పరిధి విస్తరణ




ఛేంజ్ మేకర్స్ కార్యక్రమంలో కర్నాటక సంగీత విధ్వాంసులు రజని, గాయత్రి

**ప్రజాశక్తి-మధురవాడ :** సామాజిక మాధ్యమాల ప్రభావంతో శాస్త్రీయ సంగీతం పరిధి విస్తరించి, సంగీతం నేర్చుకోవాలనుకునే ప్రతి ఒక్కరినీ చేరుతోందని, అయితే గురుముఖతహ నేర్చుకునే సంగీత శిక్షణకు, ఆన్‌లైన్ శిక్షణకు మధ్య వ్యత్యాసం కాలక్రమంలో తెలుస్తుందని ప్రముఖ కర్ణాటక సంగీత విధ్వాంసులు, సోదరీమణులు రజని, గాయత్రి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఛేంజ్ మేకర్స్ పేరిట శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సామాజిక మాధ్యమాల వల్ల కళాకారులు ఎక్కువ శాతం మందికి చేరువ అవుతున్నారని, సంగీతం శిక్షణ సహితం కొత్త మార్పులకు దారి తీస్తోందని తెలిపారు. చిన్న వయస్సులోనే సంగీతం సాధన ప్రారంభించినప్పటికీ సంగీతంలో నేటికి కొత్త అంశాలను నేర్చుకోవడానికి నిత్య విద్యార్థులుగా ఉంటున్నామని చెప్పారు. శాస్త్రీయ సంగీత శిక్షణ కాలానుగుణంగా మార్పు చెందాలని, ముఖ్యంగా నేర్చుకునే వారిలో ఆసక్తిని పెంచేలా బోధనా విధానం మార్పు చెందాల్సి ఉందని చెప్పారు. ఉమ్మడిగా సంగీత కచేరి చేయడం రెండు వైపులా పదునున్న కత్తి వంటిదని, ఎప్పటికప్పుడు ముందస్తు సాధన, విశ్లేషణ ద్వారా సమన్వయం సాధిస్తూ కచేరీలు చేస్తున్నామని తెలిపారు. భారతీయ సంగీతంలో విదేశీ సంగీత ఉపకరణాలను ఉపయోగించడం వల్ల నష్టం ఏదీ లేదని, సంగీతంలో ఎంతనేర్పుగా విదేశీ సంగీత వాయిద్యాలు ఉపయోగించాలో తెలిసి ఉండాలని పేర్కొన్నారు. సంగీత సాధనలో మార్పులను తీసుకురావాలనుకునే వారు మూలాలను చెడకుండా నిజాయితీతో కృషి చేయాలని కోరారు. అనంతరం రజనీ, గాయత్రిలను గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా, విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ కె.బాలాకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో గీతం పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ అముక్తమాల్యద, వివిధ కళాశాలల డీన్‌లు, డైరక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్ది హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ



పిల్లలతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

**ప్రజాశక్తి -పద్మనాభం :** మండలంలోని మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం విశాఖ జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సందర్శించారు. ముఖ్యంగా 10వ తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల సన్నద్ధతను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని చెప్పారు. సి, డి గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులను బి, ఎ గ్రేడ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీన నిర్వహించే డి వార్మింగ్ డేపై పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించారు. పిల్లల విద్యా ప్రమాణాలపై మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును అర్హులకు కేటాయించాలి

**ప్రజాశక్తి -ఆనందపురం :** ఆనందపురం మండలం, మామిడిలోవ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును అర్హులకు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో గన్‌రెడ్డి కనకరాజు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసి దొంగ మస్తర్లు, బినామీల పేరు మీద, మృతిచెందిన వారు, ఉద్యోగాలు చేసిన వారి పేర్ల మీద మస్తర్లు వేసి సగం డబ్బులు తీసుకోవడంతో అతన్ని అధికారులు తొలగించారని గుర్తుచేశారు. మరలా కనకరాజుకే ఆ పోస్టును అప్పజెప్పాలని కొంతమంది ముడుపులకు ఆశపడి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును ఎస్సీలకు కేటాయించాల్సి ఉందని, పేదలకు ఇవ్వకుండా కొంతమంది కనకరాజు కోసం ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని అధికారులు పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును భర్తీచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఆటో స్టాండ్ ఏర్పాటు

**ప్రజాశక్తి -తగరపువలస :** సిఐటియు అనుబంధ కార్మిక సంఘంగా ఉన్న దుర్గా భవానీ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యాన శుక్రవారం చిట్టివలస ప్రైవేట్ జూనియర్ కళాశాల హాస్టల్ సమీపంలో ఆటోస్టాండ్‌ను ఏర్పాటుచేశారు. ఈ స్టాండ్‌ను ఆటో కార్మిక సంఘం నాయకులు శివారెడ్డి, కృష్ణారెడ్డితో కలిసి సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## మహిళలకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక బ్యాంక్ కాలనీ కుమ్మరిపాలెంలోని ప్రకృతి స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 47 మంది మహిళలకు ప్రముఖ అంకాలజిస్ట్, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎన్.కల్యాణి, డాక్టర్ సంధ్య వైద్య పరీక్షలు చేశారు. వికాస్ తరంగణి మహిళా ఆరోగ్య వికాస్, శ్రీ శ్రీనివాస చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరంలో ఆయా సంస్థల ప్రతినిధులు శకుంతల, చంద్రదేవి, విజయలక్ష్మి, నాగలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.



బాలుర వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

## విద్యార్థులు బాగా చదువుకోవాలి

**ప్రజాశక్తి-పెందుర్తి :** హాస్టల్ విద్యార్థులు బాగా చదివి పేరు ప్రఖ్యాతులు తేవాలని బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ కోరారు. స్థానిక ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాలను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. హాస్టల్‌లో ఉన్న వసతులను, రికార్డులను, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు శాశ్వత భవనం మంజూరుచేయాలని వార్డెన్, సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ కె.శ్రీదేవి, గాజువాక డివిజన్ అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఎంహెచ్ఒ కిరణ్

## నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

**ప్రజాశక్తి -గాజువాక :** నులిపురుగులు నివారణకు ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్ల పిల్లలు తప్పనిసరిగా ఆల్‌బెండోజోల్ మాత్రలను వేసుకోవాలని ఎఎంహెచ్ఒ డాక్టర్ కిరణ్ కోరారు. గాజువాక జోనల్ కార్యాలయంలో మెడికల్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీన ప్రభుత్వం ఉచితంగా పిల్లలకు మాత్రలు అందజేస్తుందని తెలిపారు. దీనివల్ల పిల్లల్లో నులిపురుగుల నివారణే కాకుండా, రక్తహీనత సమస్య తగ్గుతుందని తెలిపారు. పిల్లల మానసిక ఎదుగుదల కూడా పెరుగుతుందన్నారు. గాజువాక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఈ మాత్రలను వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగప్పారావు, ఎంఇఒ అప్పారావు, నర్సులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9న డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ప్రసిద్ధ హేతువాది, సామాజిక ఉద్యమకారుడు, భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జయ గోపాల్ ప్రథమ వర్ధంతిని ఈ నెల 9వ తేదీ ఉదయం 9:30 గంటలకు పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామమూర్తి, జె.రవి తెలిపారు. ఆరిలోవలోని కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, బాల్య దశ నుంచి సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను, ఆచార సంప్రదాయాలను వ్యతిరేకించిన జయ గోపాల్ అంతర్జాతీయ స్థాయి నాయకులని, ఆయన చేసిన సేవలకు అనేక సంస్థలు అవార్డులు కూడా ఇచ్చాయని తెలిపారు అతని ధైర్యం, మేధో ధైర్యం, అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా నిలదొక్కుకున్న తీరు పదిమందికి ఆదర్శం అన్నారు. డాక్టర్ జయ గోపాల్ చిన్నతనంలోనే అనేక మత గ్రంథాలను విశ్లేషించిన మేధావి అని, పెరియార్ ఈవి.రామసామి, అంబేద్కర్, రాబర్ట్ గ్రీన్ ఇంగర్సాల్ వంటి ప్రముఖులు ఆయనకు ఆదర్శమని తెలిపారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ దినపత్రిక ఎడిటర్ రమణమూర్తి, ప్రముఖ విప్లవ కవి కుమారుడు ఉదయ్ భాస్కర్, వక్తలుగా భారత నాస్తిక సమాజం నాయకులు సాయిని నరేందర్, టి శ్రీరామ్మూర్తి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ నాయకులు వేదాంత మౌర్య ఇతర ప్రజాసంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా జయ గోపాల్ మీద రాసిన పాటను విడుదల చేయనున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ రాజా, సంతోష్, సునీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగ పరిరక్షణకు కృషి

### పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

**ప్రజాశక్తి - భీమునిపట్నం**

విద్యారంగ పరిరక్షణకు 17 ఏళ్లుగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిర్విరామంగా కృషిచేశారని, తాను గెలిస్తే అదే స్ఫూర్తితో పని చేస్తానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి స్పష్టం చేశారు. విశాఖ జిల్లా భీమిలిలో యుటిఎఫ్ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఫిబ్రవరి 27న జరుగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. 2007లో శాసన మండలి పునరుద్ధరించిన తర్వాత గెలుపొందిన ఎమ్మెల్సీలు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)గా ఏర్పడి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు, పింఛనుదారులు, నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలిలోను, వెలుపలా పోరాటాలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అనేక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. కెజిబివి, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు, అప్రెంటిస్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్లు, కాంట్రాక్టు అధ్యాపకుల మినిమం టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ పరిష్కారంలో సంఘాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సమావేశంలో యుటిఎఫ్ ప్రతినిధులు సంతోష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

**ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతా**

**ఆరిలోవ :** తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి చెప్పారు. యుటిఎఫ్ బలపరచిన విజయగౌరి శుక్రవారం ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపకులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో నిధులను తగ్గిస్తోందని, విద్యను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారని, పిల్లలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉపాధ్యాయులపై పని భారం, ఒత్తిడి పెరుగుతున్నాయన్నారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ఇతర అనేక సమస్యలపై పోరాడిన అనుభవం తనకు ఉందని, మండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతానని చెప్పారు. ఇప్పటివరకు ఉత్తరాంధ్ర నుంచి టీచర్ ఎమ్మెల్సీగా ఎన్నికైన వారు శాసనమండలిలో ఏ ఒక్క సమస్య మీదా మాట్లాడలేదన్నారు. ఒక మహిళా అభ్యర్థిగా, ఉద్యమ నాయకురాలిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు నరేంద్రకుమార్, శంకర్, నాగరాజు, రంగమ్మ, రవణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి

# పోర్టు స్టేడియంలో స్నో స్టేషన్




స్నో స్టేషన్ ప్రారంభంలో మాట్లాడుతున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** రాష్ట్రంలో తొలిసారిగా అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియంలో ఏర్పాటుచేసిన మంచుతో కూడిన స్నో స్టేషన్‌ను పోర్టు చైర్మన్ డాక్టర్ మదియన్ అంగముత్తు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంతవరకు బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై నగరాల్లో స్నో స్టేషన్లు ఉన్నాయని. టాప్ 2 నగరాల్లో ఇవి లేవని తెలిపారు. తొలిసారిగా రాష్ట్రంలో విశాఖలో ఏర్పాటుచేయడం ఆనందంగా ఉందన్నారు. కాశ్మీర్, డార్జిలింగ్ వంటి ప్రాంతాలకు వెళ్లకుండానే ఇక్కడే మంచు అందాలను తిలకించవచ్చని తెలిపారు. స్నో స్టేషన్ సందర్శించే వారికి మంచు కొండల్లో పర్యటించే అనుభూతి కలుగుతుందన్నారు. సందర్శకులకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా టెంపరేచర్ 5 నుంచి 8 డిగ్రీలు ఉండేలా నిర్వహిస్తామని తెలిపారు. దీని ఏర్పాటుకు రూ.కోట్ల రూపాయలు ఖర్చు అయినట్లు వెల్లడించారు. విశాఖ వాసులతో పాటు రాష్ట్రంలోని ప్రజలు కూడా ఈ స్నో స్టేషన్‌ను సందర్శించి కొత్త అనుభూతిని పొందుతారని ఆకాక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు బొడ్డేటి ప్రమోద్‌కుమార్, బొడ్డేటి నరేంద్ర కుమార్, పోర్టు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య అకాడమీలో ఫీజు రాయితీ

**ప్రజాశక్తి-సీతమ్మధార:** శ్రీచైతన్య అకాడమీలో ఈ నెల 7 నుంచి 14వ తేదీలోపు చేరే తొలి 100 మంది విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ బిజినెస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రిజమ్ కళాశాల సమీపంలో శుక్రవారం అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ స్కూల్లో అయినా 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న పిల్లలకు ఫౌండేషన్ క్లాసులు చెప్పనున్నట్లు తెలిపారు. తమ వద్ద ఏళ్లపాటు అనుభవం ఉన్న నిపుణులు పిల్లలకు ఐఐటి, జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు బోధిస్తారని పేర్కొన్నారు. ఉదయం నీట్, సాయంత్రం ఇంటిగ్రేటెడ్, ఫౌండేషన్ క్లాసులుంటాయని, ఏసీ తరగత గదులు, ఎల్ఈడీ స్క్రీన్లు ప్రత్యేకమని తెలిపారు. శ్రీచైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యాన నడుస్తున్న ఈ అకాడమీలో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, పూర్తి శిక్షణ ఇవ్వడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అకడమిక్ డీన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, రీజనల్ ఆపరేషన్స్ హెడ్ శ్రీకాంత్, బ్రాంచ్ హెడ్ అరుణ్ స్వరూప్, సేల్స్, అకడమిక్ టీం సభ్యులు పాల్గొన్నారు.



శ్రీచైతన్య అకాడమీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న బిజినెస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి

## 9న శ్యామ్ ఆర్థోపెడిక్‌లో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి -ఉక్కునగరం :** గాజువాక కణితి రోడ్డులో ఉన్న శ్యామ్ ఆర్థోపెడిక్ హాస్పిటల్లో ఈ నెల 9వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు. మోకాళ్లు, కీళ్లు, తుంటి, భుజం నొప్పులతో బాధపడేవారికి రూ.1500 విలువ చేసే టెస్టులను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్

**ప్రజాశక్తి-సీతమ్మధార :** తొలి తెలుగు టాకీ భక్త ప్రహ్లాద సినిమా 1932 ఫిబ్రవరి 6న విడుదలైన రోజును తెలుగు సినిమా దినోత్సవంగా పురస్కరించుకొని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ నిర్వహించిన మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్ శుక్రవారంతో ముగిసింది. విశాఖ పౌర గ్రంథాలయంలో 2004లో వచ్చిన నా ఆటోగ్రాఫ్ సినిమాను ముగింపు చిత్రంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఈ తెలుగు సినిమా దినోత్సవాన్ని పరిశ్రమ -24, క్రాఫ్ట్సుకు చెందిన సంస్థలు ప్రభుత్వంతో కలిసి పెద్ద ఎత్తున పండుగగా నిర్వహించాల్సి ఉన్నా మరిచిపోవడం బాధాకరమన్నారు. పరిశ్రమ అభివృద్ధికి దోహదపడిన వారిని గుర్తు చెసుకోవాలన్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ వచ్చే ఏడాది నుంచి ఘనంగా జరుపుతామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, డాక్టర్ బాబ్జి, డాక్టర్ సుధాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## నాంది ఫౌండేషన్ వితరణ

**ప్రజాశక్తి -తగరపువలస :** చిట్టివలస జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో 232 మంది బాలికలకు శుక్రవారం నాంది ఫౌండేషన్ ఆధ్వర్యాన క్రీడా సామగ్రి, నోటు పుస్తకాలు, పెన్నులు, షూస్‌తో పాటు నాప్కిన్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రోజామణి, ఫౌండేషన్ ప్రతినిధులు భార్గవి, సంధ్య పాల్గొన్నారు.

# విద్యార్థినులపై లైంగిక దాడులు అరికట్టాలి

## ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**ప్రజాశక్తి-వడ్డాది**

విద్యార్థినులపై లైంగిక దాడులను అరికట్టాలని, అటువంటి ఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుచ్చయ్యపేట మండలంలో వడ్డాది మేజర్ పంచాయతీ బంగారుమెట్ట జంక్షన్‌లో శుక్రవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వడ్డాది ఎన్‌టిఎస్ పాఠశాలలలో 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయునిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ రోజురోజుకు విద్యార్థినులు, మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, చట్టాలను పటిష్టంగా అమలు చేయకపోవడం వల్ల ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరు నెలల కాలంలో సుమారు 20 పోక్సో కేసులు నమోదయ్యాయన్నారు. ఎలమంచిలి పట్టణ పరిధిలో హాకీ క్రీడాకారుడు చేతిలో 13 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురైనదని, అదే ఎలమంచిలి మండలం ఏటి కొప్పాకలో మైనర్ బాలుడు నాలుగేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడని, చీడికాడ మండలానికి చెందిన విద్యార్థిని ప్రసవానికి కెజిహెచ్‌లో చేరిన ఘటనను చూడటం జరిగిందని, ఇప్పుడు వడ్డాది ఎన్‌టిఎస్ పాఠశాలలో లైంగిక దాడి చోటుచేసుకుందని తెలిపారు. ఇన్ని సంఘటనలు హోం మంత్రి అనిత సొంత జిల్లాలో జరుగుతుంటే ఆమె చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా హోంమంత్రి స్పందించి ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సినిమాలు, సామాజిక మధ్యమాల్లో అశ్లీల దృశ్యాలు యువత ఎక్కువ చూడడం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, ప్రైవేట్ యాప్‌లలో పోర్న్ వీడియోలను నిషేధించాలని కోరారు. ఎన్‌టిఎస్ పాఠశాలలో బాలికపై లైంగిక దాడికి పాల్పడుతుంటే యాజమాన్యం ఏమి చేస్తుందని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యంపె అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులను ఐక్యం చేసి పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నూకరాజు, సిఐటియు మండల కార్యదర్శి పినపాత్రుని సాంబ శివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఎన్‌టిఎస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : పిడిఎస్‌ఓ**

వడ్డాది ఎన్‌టీఎస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డాదిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుందని పేర్కొన్నారు.

**పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ**

**నర్సీపట్నం టౌన్**:అనకాపల్లి జిల్లా ,బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలో ఎన్ టిఎస్ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పై ఉపాధ్యాయుడు లైంగిక దాడి చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గౌతమ్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఇలాంటి సంఘటనలు చాలా జరిగినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం నేరస్తులను శిక్షించ లేదన్నారు. హోం మంత్రి జిల్లాలో ఇలాంటి అత్యాచారాలు తరచూ జరుగుతుంటే స్పందించకపోవడం సరికాదన్నారు. లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడుపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యులు విజయ్, డివిజన్ సభ్యులు సాయి, గణేష్, స్వామి, గణేష్, రవి, శివాజీ పాల్గొన్నారు.

## బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

**ప్రజాశక్తి-అనకాపల్లి** : బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో కేసులు వంటి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డాదికి చెందిన ఒక ప్రైవేటు స్కూల్లో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు, కాలేజీలలో పోలీస్ శాఖ ప్రత్యేకంగా విద్యార్థులతో 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికల మీద జరిగే నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించటం జరుగుతున్నదని తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు తిరిగితే వారి కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్ ప్రత్యేకమైన వాహనాలతో గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాంటి వారిని ఎవరైనా గుర్తించి తమకు తెలియజేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'పై అవగాహన

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట** : జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశాలు మేరకు స్కూల్, కాలేజీల్లో పోలీస్ వారు ప్రత్యేకంగా విద్యార్థులతో "గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికలు, అమ్మాయిలు మీద జరిగే నేరాలు" గురుంచి అవగాహన సదస్సులు నిర్వహించటం జరుగుతుందని బుచ్చయ్యపేట ఎస్సై ఏ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకతయాలు ఆగడాలు అరికట్టడానికి 'షి టీమ్స్' "పోలీస్ సిబ్బంది ప్రత్యేకమైన వాహనాలతో తిరిగుతున్నట్లు చెప్పారు.

### మహిళలకు రక్షణ కల్పనలో ప్రభుత్వ విఫలం : సిపిఎం

**ప్రజాశక్తి-దేవరాపల్లి** : మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పసి పాపలు, అభం శుభం తెలియని బాలికలు, ప్రతిఘటించలేని వికలాంగులు వంటివారిని చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 20 పోక్సో కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఒక మహిళ హెూంమంత్రిగా రాష్ట్రంలోని ఆమె సొంత జిల్లాలో పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే ఇది ఆమెకే అవమానమని పేర్కొన్నారు. హెూంమంత్రి సొంత జిల్లాలోనే మహిళలకు, మైనర్ బాలికలకు భద్రత లేకపోతే రాష్ట్రంలో అతివల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు మైనర్ బాలికలపై అత్యాచారాలు అరికట్టాలని వెంకన్న డిమాండ్ చేశారు.

### క్రీడారంగానికి రూ.2 కోట్లు విడుదలపై హర్షం

**ప్రజాశక్తి-అనకాపల్లి** : రాష్ట్ర క్రీడా రంగానికి, క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్ల రూపాయల విడుదల చేయడం పట్ల టెన్నికాయిట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎన్‌వి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మన రాష్ట్రం ద్వారా ఒలింపిక్, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు అందించాలనే ఆశయంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి అభినందనలు తెలిపారు.

### ఘనంగా బత్తుల జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-వడ్డాది** : రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. అంతకు ముందు స్థానిక శివాలయం, చర్చి, మసీదులలో తాతయ్యబాబు పేరు టిడిపి శ్రేణులు పూజలు జరిపాడు. అప్పలరాజుపురం వృద్ధాశ్రమంలో విఎస్ఆర్ సేవా ట్రస్ట్ ఛైర్మన్ వడ్డీ సత్యరావు, దొండా నరేష్ సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. మాజీ ఉపసర్పంచ్ రెడ్డి శ్రీనివాసరావు, తలారి శంకర్, మండల యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సింగంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న టిడిపి నేతలు

### రీ సర్వే సందేహాలపై ప్రత్యేక సెల్

**ప్రజాశక్తి-అనకాపల్లి** : భూ యజమానులకు, సర్వే సిబ్బంది, రెవిన్యూ సిబ్బందికి, రీ-సర్వేలో వచ్చిన సందేహాలు నివృత్తి చేయడానికి జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో జిల్లా సర్వే, భూమి రికార్డుల కార్యాలయంలో రీ-సర్వే నిపుణుల సెల్ ఏర్పాటు చేసినట్టు జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీ-సర్వే నిపుణుల సెల్ అధికారిగా సర్వే ఇనస్పెక్టరు ఎంఆర్‌పి.బాబును నియమించడం జరిగిందన్నారు. సందేహాలు నివృత్తి చేయడానికి 9121622335 నెంబరులో కార్యాలయ పనిదినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. భూ యజమానులు, సర్వే సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది రీ-సర్వేలో వచ్చిన సందేహాలు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని జాయింటు కలెక్టరు తెలిపారు.

### ఫార్మా క్షతగాత్రునికి రవికుమార్ పరామర్శ

**ప్రజాశక్తి-సబ్బవరం** : పరవాడ ఫార్మాసిటీలోని రాంకీ ఎఫ్లయిన్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుని వైసిపి పెందుర్తి నియోజకవర్గ నాయకులు గండి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. మండలంలోని పైడివాడ ఆగ్రహారం పంచాయితీ శివారు పీతపాలెం గ్రామానికి చెందిన కరణం ముత్యాలు ప్రమాదంలో గాయపడి అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం తెలుసుకున్న రవికుమార్ ముత్యాలును పరామర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బాధితుడిని యాజమాన్యం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కరణం శ్రీను, దాసరి శ్రీను, నక్క వాసు, యడ్ల నాయుడు, ఐడి బాబు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్, పైల రామునాయుడు, సిరపరపు నవీన్ పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

**ప్రజాశక్తి-అనకాపల్లి** : భారత ప్రభుత్వ సంస్థ సీఐపిఈటిలో ఎన్ఎస్ఎస్‌హెచ్ పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎంఎస్ఎంఈ, ఎన్ఎస్ఐసి సంయుక్త సౌజన్యంతో 30 మందికి ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. మిషన్ ఆపరేటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్ లో ఐదు నెలలపాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్తో అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హెూసూరు, చెన్నై ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యాలు ఉంటాయని, పదవ తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాలు వయసు గలవారు బి అంజి నాయక్, సిఐపిఈటి ప్రతినిధి 7893586494 నెంబర్ను సంప్రదించాలని కోరారు.



విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న దృశ్యం

### టెన్త్ నమూనా పరీక్షల్లో

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు

**ప్రజాశక్తి-ఎలమంచిలి**

ఎలమంచిలి కొత్తపేట హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్త్ మోడల్ టెస్ట్‌లో విజేతలకు శుక్రవారం బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎలమంచిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ్ రావు, పట్టణ ఎస్ఐ సావిత్రి హాజరై మాట్లాడారు. ఇటువంటి పోటీ పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రానున్న పబ్లిక్ పరీక్షలకు చక్కగా ప్రిపేరయి మంచి ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని, చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని సూచించారు. అమృత ట్యూషన్ సెంటర్ ప్రతినిధి ఎం.సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం కాపాడుకుని రానున్న పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. బాలాజీ మాట్లాడుతూ విద్యార్థినిపై లైంగిక దాడులు అగత్యాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 5వ తేదీన జరిగిన ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన మొదటి 18 మందికి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎ.అభి డివిజన్ నాయకులు సిహెచ్ ,రాము సిహెచ్, లక్ష్మణ్, రాజేష్, శ్రీను, రాఘవేంద్ర, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన వైబ్రంట్ డైట్ ఉత్సవాలు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో వైబ్రంట్ డైట్ 2కె25 ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా రేర్ అడ్మిరల్ మురళి మోహన్ రాజు, గౌరవ అతిథులుగా కెప్టెన్ ఎన్.ధీరజ్, ప్రముఖ చలనచిత్ర నేపథ్య గాయకుడు అదితి భావరాజు హాజరై వారి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. అర్.వైకుంఠ రావు మాట్లాడుతూ టైం మేనేజ్మెంట్, ఉన్నత విద్య, జీవితంలో ఉన్నత శిఖరాలను ప్రతి విద్యార్థి అధిరోహించాలని సూచించారు. కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ నూతన జాతీయ విద్య విధానం 2020లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని, ఒకే సమయంలో వివిధ విభాగాల్లో అనేక కోర్సులు అభ్యసించి తద్వారా డిగ్రీలో పట్టా పొందవచ్చని తెలిపారు. మురళీ మోహన్ రాజు ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక లక్ష్యం ఉండాలన్నారు. ఎన్. ధీరజ్ ప్రతి విద్యార్థి సంప్రదాయాలు, స్నేహం, పట్టుదల, నిరంతర కృషి ఉండాలని కోరారు. అదితి భావరాజు మాట్లాడుతూ గడిచిన కాలం తిరిగి రాదని ప్రతి క్షణాన్ని సంతోషంగా మలచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విబ్రెంట్ డైట్ కన్వీనర్ కె. సుజాత, వైస్ ప్రిన్సిపాల్ గణేష్ ప్రసాద్ రెడ్డి, డీన్ అడ్మిన్ కె.ఎస్.ఈశ్వర రావు, డీన్ అకడమిక్స్ ఎ.కృష్ణ నాగ్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## గుండెను రక్షించుకోవాలి

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** మారుతున్న ఆహారపు అలవాట్లు తగిన వ్యాయామం లేకపోవడంతో చిన్నతనం నుండే గుండెపోటుకు గురవుతున్నారని 'గుండెకు భరోసా' అనే కార్యక్రమంపై గ్రామాల్లో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టరు శ్రీలక్ష్మి అన్నారు. గుండెకు భరోసా ఇచ్చే "స్టెమి"అనే హృద్రోగ నిర్ధారణ, వైద్య చికిత్స ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహనా కల్పించేందుకు శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీనికి సంబంధించి కర పత్రాలను డాక్టర్లు అవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టరు శ్రీలక్ష్మి మాట్లాడుతూ గుండెపోటు వస్తే వారికీ మొదటి గంట అత్యంత కీలకమని, వెంటనే చర్య తీసుకొని ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. గుండెపోటుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాధమిక పరీక్షలు చేసి తొలి గంటలోనే రూ.45,000 విలువైన "టెనెక్టేప్లెస్" ఇంజక్షన్‌ను ఉచితంగా ఇచ్చి ప్రాణాలను కాపాడుతన్నట్లు చెప్పారు. డాక్టరు కోటేశ్వరరావు మాట్లాడుతూ గుండె పోటు రావడానికి కారణాలు వివరించారు. కార్యక్రమంలో డాక్టరు సురేంద్ర, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అరకును వాల్తేరు డివిజన్‌లో ఉంచాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ఏడాదికి రూ.10 వేల కోట్ల ఆదాయం వచ్చే కిరండోల్ లైన్ లేని వాల్తేర్ డివిజన్ అంటే ఉత్తరాంధ్రకి తీరని ద్రోహం అని ప్రజా సంఘాల నేత డాక్టర్ చిన్ని యాదవ్ ధ్వజమెత్తారు. విశాఖ కేంద్రంగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటులో కేంద్రం ఉత్తరాంధ్రకి తీరని ద్రోహం తలపెట్టిందని యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వాల్తేర్ డివిజన్లో ఉన్న అరుకును ఇప్పుడు ఒరిస్సాలోని రాయగడ డివిజన్‌కు మార్చేయడం ఏమిటని మండిపడ్డారు. ఒరిస్సా రాజకీయ శక్తులన్నీ కలిసి కొత్తవలస నుంచి అరుకు వరకు రాయగడ డివిజన్‌కు పట్టుకుపోతున్నా ఆంధ్రాలో నాయకులు చూస్తూ ఊరుకోవడం దారుణమన్నారు. అరుకుని వాల్తేరు డివిజన్‌గా ఉంచేలా చూడాలని కోరారు.

## విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

**ప్రజాశక్తి-వడ్డాది :** జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వడ్డాది ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. గృహ హింస, ఆర్థికంగా మహిళలపై వేధింపులు జరిగినప్పుడు, అత్యాచారాలు, లైంగిక దాడులు జరిగినప్పుడు ఎదురుకునే సమస్యలపై అవగాహన కల్పించారు. కిడ్నాప్, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు జరిగినప్పుడు చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం కొరకు అనకాపల్లి వన్ స్టాప్ సెంటర్ కార్యనిర్వాహణాధికారి ఫోన్ 0892-293294, ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ -181 నంబర్లును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోవెల వెంకటరమణ, సిడిపిఓ పుష్పవతి, సుపర్ వైజర్ రాజా రాజేశ్వరి, అంగన్వాడి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల పట్ల హర్షం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## వెట్టి చాకిరీ సామాజిక వెనుకబాటుతనం

**ప్రజాశక్తి-చోడవరం :** వెట్టిచాకిరి అనేది మన దేశంలో ఎంతో కాలంగా ఉన్న ఒక సామాజిక వెనుకబాటుతనమని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకర్రావు పేర్కొన్నారు. శుక్రవారం చోడవరం స్థానిక శ్రీవాసవి కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు యొక్క వెనుకబడుతనాన్ని అవకాశాన్ని ఆసరాగా తీసుకొని బానిసత్వానికి గురిచేయడాన్ని ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొలగాని సతీష్, బి చంద్రశేఖర్, అసోసియేషన్ సెక్రెటరీ ఉప్పల నాగేశ్వరరావు, విసిహెచ్ఆర్ గుప్తా, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గౌరీ శంకరరావు

పాడి రైతులను

# దోచుకుంటున్న విశాఖ డెయిరీ యాజమాన్యం

### ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

**ప్రజాశక్తి-అనకాపల్లి**

విశాఖ డెయిరీ యాజమాన్యం పాడి రైతులను నిలువునా దోచుకుంటుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ విమర్శించారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో శుక్రవారం ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన డెయిరీ పరిధిలోని ఆరు జిల్లాల పాడి రైతుల ప్రతినిధుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవు పాలు ధర తగ్గించడం దారుణమన్నారు. ఏడాది పొడుగునా రైతులు సరఫరా చేసిన పాల వ్యత్యాసం ధర రైతులకు చెల్లించాలన్నారు. 30 లీటర్ల కంటే తక్కువ పాలు సేకరణ చేస్తున్న కేంద్రాల నుంచి పాలు తీసుకోవాలన్నారు. పశు పోషణ ఖర్చులు భారీగా పెరిగినందున ఆ నిష్పత్తిలో పాల ధరను పెంచాలన్నారు. పాల సేకరణ ధరకు అమ్మకం ధరకు వ్యత్యాసం విపరీతంగా ఉన్నందున కోట్లాది రూపాయలు యాజమాన్యం ఆర్జిస్తున్నా యాజమాన్యం వాటిని దారి మళ్లించి నష్టాలు చూపడం సరి కాదన్నారు. డెయిరీ చేస్తున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకై ఈనెల 17న అన్ని జిల్లాల్లోనూ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.రాంబాబు, అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు కర్రి అప్పారావు, అధ్యక్షులు భూలోక నాయుడు, విజయనగరం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, పార్వతీపురం అధ్యక్షులు రెడ్డి రమణమూర్తి, అనకాపల్లి రైతు సంఘం నాయకులు గండి నాయన బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నేత సూర్యనారాయణ

# ఢిల్లీలో రైతు నేత ఆమరణ దీక్షకు సంఘీభావం



అఖిలపక్ష రైతు సంఘాల ప్రతినిధుల నిరసన

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** రైతులు ఎదుర్కొంటున్న దీర్ఘకాల సమస్యలపై దేశ రాజధాని ఢిల్లీలో పోరాటం చేస్తున్న రైతు నాయకులు దల్లెవాలకు సంఘీభావంగా మండలంలో కొండకర్ల జంక్షన్లో శుక్రవారం అఖిలపక్ష రైతు సంఘాలత ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం ప్రతినిధి కె.రామ సదాశివరావు మాట్లాడుతూ రైత సమస్యలపై ఢిల్లీలో 54 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న దల్లెవాల ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తుందని తెలిపారు. అయినప్పటికీ రైతు సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం శ్రద్ధ చూపలేదన్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో ఈనెల 14న ఆయనతో చర్చలు జరపటానికి ప్రభుత్వం నిశ్చయించిందని, ఈ చర్చలు రైతులకు అనుకూలంగా, సమస్య పరిష్కరించే ఉండేందుకు ఆమరణ నిరాహారదీక్షకు సంఘీభావంగా రైతాంగం కదిలి రావాలని పిలుపునిచ్చారు. ముందస్తుగా ఈనెల 11న ఉదయం కొండకర్ల జంక్షన్ నుండి అనకాపల్లి వరకు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు తదితర వాటిపై ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు బుద్ధ రంగారావు, కె జోగి నాయుడు, ఎస్ కనుము నాయుడు, బిల్లా ప్రకాష్, పి కృష్ణారావు, నట్టే నర్సింగరావు, పి నాగేశ్వరరావు, కోసూరి ఈశ్వరరావు, ఎన్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం

**ప్రజాశక్తి-సబ్బవరం :** మండలంలోని ఆరిపాక పంచాయితీ శివారు చినయాతపాలెం గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, మహిళా కోలాటాలు, డాన్స్ బేబీ డాన్స్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శరగడం దుర్గినాయుడు, మళ్ళ బాలాజీ, శరగడం సత్యనారాయణ, మళ్ల నాగభూషణం, మళ్ల గంగునాయుడు, దొడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

## నేటి నుండి ఉమామహేశ్వరి తీర్థ మహోత్సవం

**ప్రజాశక్తి-దేవరాపల్లి :** దేవరాపల్లిలో శ్రీఉమామహేశ్వరి దేవి తీర్థ మహోత్సవాలు శనివారం నుంచి ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 12న జిల్లాస్థాయి ఎడ్ల పరుగులు ప్రదర్శన జరుగుతుందని, విజేతలకు రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు, రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు చొప్పున బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## పాడి రైతులకు సన్మానం

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** హెరిటేజ్ డెయిరీకి అధిక పాలు ఉత్పత్తి చేస్తున్న కొల్లివానిపాలెం గ్రామానికి చెందిన పాడి రైతులు రాజాన సత్యారావు, రాజాన కృష్ణబాబును శుక్రవారం రీజనల్ మేనేజర్ పి తులసి నాయుడు చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, వెట్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, సూపర్వైజర్ సిహెచ్ గోవింద్, రాజాన ముత్యాల నాయుడు, చుక్క దేవుడు, చుక్క ప్రసాదు, బండారు గోపికృష్ణ, కొల్లు నాయుడు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయాలి

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట :** గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి గోపాలరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని దిబ్బిడి, చిన్నప్పన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి విజయలక్ష్మి, ఏపిఓ వరహాలుబాబు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** మండలంలోని ఎర్రవరం గ్రామంలోని 148, 149, 147 సర్వే నెంబర్లలో అచ్చన్న చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ తెలిపారు. అలాగే సర్వే నెంబరు 153లో కేశవరాయకొండపై గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్లు చెప్పారు. పది రోజులుగా తవ్వకాలు జరుపుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఎర్రవరంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## జీవన విధానం మార్పుతో కేన్సర్ నివారణ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జీవన విధానంలో మార్పు ద్వారా క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని తుమ్మపాల పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, ఏఎన్ఎం రాజరాజేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆహారపు అలవాట్లు చెడు అలవాట్ల వలన క్యాన్సర్ ఏ విధంగా వృద్ధి చెందుతుందో, అవి వస్తే ఏ రకమైన లక్షణాలు కనబడతాయో, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, క్యాన్సర్ దశలపై పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో కూటమి పెద్దలు కోన అప్పారావు, కోన దుర్గేశ్వరరావు, 50 మంది ప్రజలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న బుచ్చిరాజు కుమారుడు నవనీత్ వర్మ

## ఘనంగా బుచ్చిరాజు జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-సబ్బవరం :** తెలుగు యువత అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు పిబివిఎస్ఎన్.రాజు (బుచ్చిరాజు) జన్మదిన వేడుకలు మండలంలోని ఇరువాడ దరి అతిథి గృహంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నేతలు, అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో బుచ్చిరాజు కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనకు పలువురు పుష్పగుచ్చాలు ఇచ్చి సాలువలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదినం సందర్భంగా బుచ్చిరాజు తనయుడు నవనీత్ వర్మ ఆధ్వర్యంలో పెందుర్తి లయోలా ఓల్డ్ ఏజ్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భరణికాన సాయినాథరావు, కొటాన అప్పారావు, మిడతాడ మహాలక్ష్మినాయుడు, దాట్ల మధు, దొడ్డి సూర్యప్రకాష్‌రావు, కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, ఎం.అక్కుబాబు, పెద్దాడ రమణమ్మ, పడాల వెంకటరమణ, వాకాడ కనకరాజు పాల్గొన్నారు.

## అంతర్గత నైపుణ్యాలను వెలికితీయాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ ఎ.గోవిందరావు అన్నారు. ఈ కృషిలో దాడి వీర నాయుడు కళాశాల యాజమాన్య ప్రతిభ గర్వించ తగినదని పేర్కొన్నారు. స్థానిక దాడి వీరు నాయుడు కళాశాలలో శుక్రవారం భారత మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్మెంట్ అనుబంధ సంస్థ, ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) ఆధ్వర్యంలో పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా గోవిందరావు విచ్చేసి విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్లను, పిపిటిలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ దయా మాధురి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

**ప్రజాశక్తి-కశింకోట :** కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు కూడా ఉచితంగా ఇస్తామని డాక్టర్ శ్రావణ్ శక్తి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంఆర్‌వి అప్పారావు, క్యాంపు కోఆర్డినేటర్ కె.ప్రసాద్, మెడికల్ సిబ్బంది లావణ్య, లక్ష్మీ, కార్తీక్ పాల్గొన్నారు.




కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

# 'స్పేసెస్'లో ఘనంగా యువజనోత్సవాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ ప్రకాష్

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న స్పందన యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యూత్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఆటపాటలతో, నృత్యాలతో సందడి చేశారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, క్రీడలు సుమారు 30 అంశాలలో విద్యార్ధినీ, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రామకృష్ణారెడ్డి, ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్, (హంసవరం) జూనియర్ లెక్చరర్ జి.గ్లోరియా శాంతికపోతాలు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్లోరియా నిర్వహించిన ప్యానల్ డిస్కషన్(ఇష్టాగోష్టి) లో కెరియర్‌లో సాఫ్ట్ స్కిల్స్ పాత్ర అనే అంశంపై విద్యార్థి అతిధులు తమ అభిప్రాయాలను వెల్లబుచ్చారు. ఈ సందర్భంగా సిహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరచుకోవడానికి స్పందన ఒక వేదిక కాగలదన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హెచ్ ఆర్‌వీవీఎస్ బి.బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రతినిధులు

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి -నక్కపల్లి:బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు అన్నారు. మండలంలోని రేబాక గ్రామంలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు వయస్సు నిండని ఆడపిల్లలకు వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు చేయడంతో పిల్లలు అనారోగ్యాల బారిన పడతారన్నారు. బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సీడ్ ఆర్గనైజర్లు, పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది అంగన్వాడీ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎపిడి

## ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో కొత్తచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పని పనులను శుక్రవారం అనకాపల్లి క్లస్టర్ ఎపిడి మణికుమార్ సందర్శించారు. మేట్లకు తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా మణికుమార్ మాట్లాడుతూ, నియమిత కొలతలతో పని చేసి రూ.300 వేతనాన్ని పొందాలని సూచించారు. చెరువు గట్టుని అందంగా తయారు చేయాలన్నారు. ప్రతి మేట్ దగ్గరుండి మంచి నాణ్యమైన పనిని చేయించాలన్నారు. కూలీలతో సత్సంబంధాలు ఏర్పరచుకొని పని చేపించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ డి.కొండాజి, సర్పంచ్ దాసరి సూర్యకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ వరహాలు, మేట్స్ వేతనదారులు పలువురు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మండల ప్రత్యేక అధికారి కెవిఎన్ మూర్తి

ప్రజాశక్తి -చీడికాడ:పారిశుద్ధ్యం పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి, అనకాపల్లి జిల్లా డిఎస్‌ఓ కెవిఎన్ మూర్తి సూచించారు. మండలంలోని చెట్టుపల్లిలో పారిశుద్ధ్య నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా నినాదాలు చేశారు. ప్రజలు పారిశుద్ధ్యం మెరుగుతో పాటు క్యాన్సర్ పై అవగాహన కలిగి ఉండాలని, సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమ సుందర్రావు, పంచాయతీ విస్తరణ అధికారి కామేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో ఉత్సవాల సందడి


నక్కపల్లిలో క్యూలో ఉన్న భక్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చందనాడ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్స వాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పలు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భజన నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పుణ్యమంతుల బాబ్జి, సిద్ధాంతి గోర్స నానాజీ, నారాయణరావు, నాయకులు కర్రి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి:మండలంలోని రేబాక గ్రామంలో సుమారు రూ.కోటితో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన గూడుపమ్మతల్లి క్షేత్రం (శక్తిపీఠం), దేవతా విగ్రహాల ప్రతిష్టను ఘనంగా నిర్వహిం చారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరిరాజు, సర్పంచ్ సాధిరెడ్డి శ్రీనివాసరావు, సాదిరెడ్డి చిన వెంకన్న, కాసుబాబుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు శ్రీ ప్రకాశ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

రేబాక క్షేత్రంలో దేవతా విగ్రహాలతో పాటు, ఆలయం ఆవరణలో కొత్తగా నిర్మించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది.

**ఘనంగా దుర్గమ్మ పందిరి రాటోత్సవం**

నక్కపల్లి:మండలంలోని ఉపమాక దుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం ఉదయం ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకట రమణ ఆధ్వర్యంలో పందిరి రాటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని 10 వ తేదీన ఏకాహం ( భజన ),11న ప్రత్యేక పూజలు, అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అర్చకులు మహేష్, గురు భవాని ద వరసింగి రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు .

**ఘనంగా అడవిరాజులుబాబు పండగ**

గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేటలో శుక్రవారం అడవి రాజులబాబు పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొమనాపల్లి రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడవిరాజులబాబులను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


శుభ్రం చేస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

## పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామంలో శుక్రవారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని పరిసరాల్లో చెత్తను ఎత్తి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మీ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామకృష్ణ, సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు పాల్గొన్నారు.

## నిధులు వినియోగించుకోవాలి

-ఉమ్మడి జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి



ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలకు మంజూరు అవుతున్న 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి సూచిం చారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాభీష్టం మేరకే అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావుకు సూచించారు. అనంతరం తహసిల్దార్ కార్యాల యంలో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఇఒ జగ్గారావు

## ప్రణాళికతో చదవాలి

ప్రజాశక్తి-రోలుగుంట:పది విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలని రోలుగుంట ఎంఈఓ-2 జగ్గారావు సూచించారు. శుక్రవారం రోలుగుంట జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దగ్ధమైన తోట

## యూకలిప్టస్ తోట దగ్ధం

ప్రజాశక్తి -రావికమతం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో యూకలిప్టస్ తోట ఖాళీ బూడిద య్యింది. మండలంలోని మేడివాడ నుంచి అప్పలమ్మపాలెం వెళ్లే రహదారిలో 11 కె.విద్యుత్తు లైన్ తీగలు రాపిడికి గురై మంటలు ఎగిసి పడడంతో తోట ఖాళీ బూడిదయ్యింది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా సిబ్బంది మంటలను అదుపు చేశారు.

## కూలీలకు అవగాహన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలో గబ్బాడ సమీపంలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కూలీలతో మండల లీగల్ కమిటీ సర్వీస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కూలీలకు బట్టీలలో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కూలీలచే వెట్టిచాకిరి చేయించకూడదని, ఇబ్బందులకు గురి చేయకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ ఏ శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కే అప్పలనాయుడు, కే వెంకట్రావు, లేబర్ ఆఫీసర్ రామచంద్రరావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

## పిఒ అభిషేక్ సేవలు అభినందనీయం

- కలెక్టర్ దినేష్ కుమార్- ఘనంగా ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: బదిలీపై వెళుతున్న ఐటిడిఏ, పి.ఓ. వి.అభిషేక్ సేవలు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ కొనియాడారు. గిరిజన ప్రాంతం అభివృద్ధికి నిరంతరం కృషి చేసారని పేర్కొన్నారు. ఐటిడిఏ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోనే పెద్ద ఐటిడిఏలో అనేక సమస్యలను పరిష్కరిస్తూ విధులు నిర్వహించారన్నారు. వరదలు, తుఫానుల సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి సమస్యలను పరిష్కరించారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు బదిలీపై వెళుతున్న ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో పని చేయడం అదృష్టమన్నారు. అందరి సహకారంతో గిరిజనులకు సంతృప్తి కరమైన సేవలు అందించానని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి.ఎఫ్.ఓ, పి.వి. సందీప్ రెడ్డి, డి.ఆర్.ఓ. కె.పద్మలత, సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలతలు సత్కరించారు.

## పాఠశాలల వద్ద పోలీసు గస్తీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వద్ద జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు ఎస్సై పి.రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భద్రతకు సంబంధించి పలు సూచనలు చేశారు. జోగంపేట, కొత్తమల్లంపేట, చీడిగుమ్మల, గుండుపాల, కొత్తఎల్లవరం, పాకలపాడు, కేజీబీవిల వద్ద గస్తీ నిర్వహిస్తున్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:** పట్టణంలోని మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్‌తో బైక్ లపై ప్రయాణిస్తూ పట్టుబడ్డ యువకులకు శుక్రవారం సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవిందరావు ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీ నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలతో వాహనదారులు గాయాలపాలవుతూ మృత్యువాత పడుతున్నారని, వీరిలో యువకులు, మైనర్లే ఉన్నారని తెలియజేసారు.ఆ ప్రమాదాల్లో గాయపడి మృతి చెందిన వారి కుటుంబాల ప్రస్తుతం పరిస్థితులపై వివరించారు. సురక్షిత ప్రయాణం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. బాధ్యతా రాహిత్యంతో వాహనాలు నడుపుతూ. ప్రాణాల మీదుకు తెచ్చుకోవద్దని సూచించారు. నియమ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న బంధువులు

## వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతి

-బంధువుల ఆరోపణ

**ప్రజాశక్తి -కోటవురట్ల:** స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతూ శిశువు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్.రాయవరం మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన కట్టా సుశీల దేవిని కాన్పుకు గురువారం తీసుకు వచ్చారు. శుక్రవారం ఆమె ప్రసవించింది. శిశువుకు చలనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు వైద్య సిబ్బందికి విషయాన్ని తెలియజేశారు.ఉమ్మనీరు అతిగా వస్తుందని పలుమార్లు సిబ్బందికి చెప్పినా నిర్లక్ష్యం వహించారని బంధువులు ఆరోపించారు.

హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రసాద్ ను వివరణ కోరగా.. నార్మల్ డెలివరీకి అవకాశం ఉండడంతోనే కాన్పు నిర్వహించినట్లు తెలిపారు, అయితే మరో గైనిక్ డాక్టర్ అనీషా సెలవులో ఉండడంతో జనరల్ డాక్టర్లు పర్యవేక్షించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి

## నులి పురుగులపై అవగాహన

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** చిన్నారుల్లో నులి పురుగుల నివారణకు కృషి చేద్దామని స్థానిక వైద్యాధికారి పి రాంబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలను వేయించాలన్నారు. చిన్నారుల ఎదుగుదలకు తోడ్పాటునందిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి

-కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, అన్ని రకాల కార్యకలాపాలను అత్యంత సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని నోడల్ అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. నామినేషన్లు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వసతుల కల్పన, జాబితాల తయారీ, సిబ్బంది కేటాయింపు, వివిధ రకాల విధుల నిర్వహణ తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, అనుమతుల జారీ విషయంలో చురుగ్గా వ్యవహరించాలన్నారు. సింగిల్ విండో విధానం పాటించాలని సూచించారు. ఆయా నోడల్ అధికారులు ఇప్పటి వరకు చేపట్టిన చర్యల గురించి ఆరా తీసిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. మరింత జాగ్రత్తగా ఉండాలని, ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు తప్పకుండా నిర్వర్తించాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది, సామగ్రి తరలింపు తదితర అవసరాలకు రవాణా సదుపాయం ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని సూచించారు. ఈ సమావేశానికి హాజరైన అధికారులు వారి పరిధిలోని పరిస్థితుల గురించి రిటర్నింగ్ అధికారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఎఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

# క్వారీ లారీలతో రోడ్లు ఛిద్రం




రాకపోకలు సాగిస్తున్న క్వారీ లారీలు

**ప్రజాశక్తి-రోలుగుంట:** రోలుగుంట మండలంలో క్వారీ లారీలతో ఆయా గ్రామాల వాసులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని బుచ్చంపేట, గొల్లపేట గ్రామస్థులు తమ గ్రామాల నుంచి లారీలు తిరగకూడదని, వీటితో రోడ్లు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బుచ్చంపేట గ్రామస్థులు లారీలను అడ్డుకోగా గత రెండు రోజుల క్రితం గొల్లపేట గ్రామస్థులు కూడా లారీలను అడ్డుకున్నారు.తాము ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారులు కూడా ఎక్కడా కనిపించడం లేదంటూ ఆయా గ్రామస్థులు అంటున్నారు.

ఇదిలా ఉండగా తాజాగా గురువారం రాత్రి కొవ్వూరు గ్రామంలో క్వారీ లారీ ఢీకొట్టడంతో మూడు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో ఆ ప్రాంతంలో అంధకారం నెలకొంది. గ్రామంలోని యువకులు, ప్రజలు రాత్రి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినప్పటికీ ఎవరు ఎటువంటి చర్యలు తీసుకోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సమస్యకు పరిష్కారం చూపాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గ్రామ యువకులు తెలిపారు.

# ఆర్‌డిఒకు పయనీర్ బాధితుల వినతి



వినతిపత్రాన్ని ఇస్తున్న బాధితులు

**ప్రజాశక్తి-కోటవురట్ల:** మకవరపాలెం మండలంలో గడిచిన రెండు రోజులుగా పయనీర్ కంపెనీ భారీ వాహనాల రాకపోకలపై చేపడుతున్న నిరసన శిబిరాన్ని నర్సీపట్నం ఆర్డిఓ వీవి రమణ సందర్శించారు. ఈ సందర్భంగా వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఉద్యమకారులు 17 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. 100 అడుగుల రోడ్డు నిర్మాణంతోపాటు ప్రతిరోజు రోడ్లపై వాటరింగ్, భారీ వాహనాలు నిలిపివేత, ప్రతి గ్రామానికి ఆర్వో ప్లాంట్, పయనీరు కంపెనీ ఆక్రమించుకున్న ప్రభుత్వ చెరువులు తిరిగి అప్పగించాలని నిరసన కారులు తెలిపారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వంటి డిమాండ్లను ఆర్డిఓకు వినతి పత్రంలో తెలిపారు.

**స్పీకర్‌తో లారీ యజమానుల మంతనాలు**

కాగా పైనీరు కంపెనీకి వెళ్లే ముడి సర్కుల లారీలు, అలాగే అల్యూమినియం లోడుతో ఉన్న లారీ యజమానులు స్థానిక ఎమ్మెల్యే ఆంధ్ర ప్రదేశ్ స్పీకర్ అయినపాత్రుని తో మంతనాలు జరిపినట్లు తెలిసింది, ఈ సందర్భంగా స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఉద్యమం ఆపేది లేదని అన్నారు, కార్యక్రమంలో పయనీర్ కంపెనీకి చెందిన పరిసర ప్రాంత నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## పింఛన్ సొమ్ము అపహరణపై విచారణ

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని జోగుంపేట సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ సాలికమల్లవరం పంచాయతీ పొగచెట్ల పాలెం గ్రామంలో 13 మంది పింఛన్ నగదుతో ఈనెల 2న ఉడాయించాడు. ఈ మేరకు తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ మేరీరోజ్ శుక్రవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఆయనపై చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేస్తామన్నారు.



విచారణ చేస్తున్న తహశీల్దార్

## ఘనంగా స్వామి వివేకానంద శోభాయాత్ర

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:** స్వామి వివేకానంద నేషనల్ యూత్ డే( వివేకనంద జయంతి ) సందర్భంగా విశాఖ రామకృష్ణ మిషన్ ఆశ్రమము ఆధ్వర్యంలో స్వామి వివేకానంద శోభాయాత్ర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాబా గార్డెన్స్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద చేపట్టిన

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో సహా వేల సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.ఈ శోభయాత్ర సెవెన్ హిల్స్ హాస్పిటల్ జంక్షన్ నుండి రెవెన్యూ క్వార్టర్స్ వరకు కొనసాగింది.తదనంతరం స్వామి వివేకనంద విగ్రహానికి నివాళులు అర్పించారు.




ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

## హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి : సిపిఎం

**ప్రజాశక్తి-పాడేరు:** అనంతగిరి మండలంలో హైడ్రో పవర్ ప్రాజెక్టును నవయుగ కంపెనీకి అప్పగిస్తూ రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడంపై సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స వెల్లడించారు. ఏజెన్సీలో అమలవుతున్న 1/70 చట్టాన్ని సవరించాలనే వ్యాఖ్యలను నేటి రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం బలపరుస్తున్నట్లుగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు శుక్రవారం స్థానిక సి.పి.ఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కిల్లో మొస్య, ఎస్.సుందరావు, కె.రామరావుతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతాల్లో ప్రవేట్ కంపెనీలకు సహజ వనరులు కట్టబెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అనంతగిరి మండలం నిమ్మలపాడు మైనింగ్ లీజును రద్దు చేయాలని సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌లో తీర్పు ఇస్తూ ప్రభుత్వానికి షెడ్యూల్డు ఏరియాలో లీజ్‌కి ఇచ్చే అధికారం లేదని, నాటి మైనింగ్ ఒప్పందాన్ని రద్దు చేసిందన్నారు.నాడు కూబి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వమేనని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పులను కూడా గౌరవించకుండా అడ్డగోలుగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లొంగి ప్రవేట్ సంస్థలకు ఏజెన్సీ ప్రాంతాల్లో సహజ వనరులను అప్పగించడం అన్యాయ మన్నారు. ఇప్పటికీ 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన పాత్రుడు వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం బలపరుస్తూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను ప్రవేట్ సంస్థలకు కేటాయించడం దారుణమన్నారు. పిసా చట్టాన్ని దిక్కరించడం సరికాదన్నారు.గ్రామ సభ అభిప్రాయాలను కూడా తీసుకోలేదని. గిరిజన సలహా మండలి (టి.ఏ.సి ) ఆమోదం కూడా లేదని, గత ప్రభుత్వ వైఖరికి, నేటి ప్రభుత్వం వైఖరికి ఏమి తేడా లేదని ఆదివాసీ సంపదను దోచిపెట్టడమే లక్ష్యంగా పాలన ఉందని అన్నారు.